ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
12 డిసెంబర్
2024



# ఎస్.వీ.ఎన్ డిజిటల్ స్కూల్‌లో గీతా జయంతి వేడుకలు

## విశ్వవ్యాప్తమైన గీత సీడీ చౌహాన్
## గీత వైభవాన్ని చాటి చెప్పాలి: ప్రసన్న కృష్ణ దాస్
## విశ్వ మానవాళికి దిక్సూచిగా గీత: ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్



యాదగిరిగుట్ట రోమింగ్ న్యూస్: గీతా జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని అఖండ నమాశ్రమం ఆధ్వర్యంలో గుట్ట పట్టణం లోని ఎస్.వీ.ఎన్ డిజిటల్

హైస్కూల్‌లో విశాలమైన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భగవద్గీత యొక్క శాశ్వత సందేశాలను పూజ్యులైన ప్రముఖులు వివరించి, భారతీయ సంస్కృతిని సంరక్షించడంలో మన బాధ్యతను గుర్తుచేసారు. ఈ కార్యక్రమంలో గ్లోబల్ హిందూ ఫెడరేషన్ ప్రెసిడెంట్ మరియు శివాజీ మహారాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు సీ.డీ చౌహాన్, అఖండ నమాశ్రమం ప్రధాన కార్యదర్శి ప్రసన్న కృష్ణ దాస్ ప్రభుజి, పీటాధిపతి వీర ధర్మజ స్వామి తదితరులు ప్రసంగించారు. సీడీ చౌహాన్ ప్రసంగంలో భగవద్గీత యొక్క విశ్వవ్యాప్త ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, "భగవద్గీత యొక్క ఉపదేశాలు సమయం మరియు సరిహద్దులను మించిపోయి, ప్రతి వ్యక్తికి దారి చూపే వేదన. ఈ గణనీయమైన వారసత్వాన్ని మనం ప్రతిపాదించి, భవిష్యత్తు తరాలకీ అందించాల్సిన బాధ్యత మన మీద ఉంది." అని చెప్పారు. ప్రసన్న కృష్ణ దాస్ ప్రభుజి తమ ప్రసంగంలో భగవద్గీత అనేది కేవలం ఒక పుస్తకం మాత్రమే కాదు, ఒక జీవన విధానమని చెప్పారు. "భగవద్గీత జీవితం మీద సాధన, ధర్మం, మరియు భక్తి యొక్క మార్గాలను చూపిస్తుంది.



దీనిని ప్రతి వ్యక్తి తన జీవితం లో పాటించాలి." అని అన్నారు.

పితాధీ పతి వీర ధర్మజ స్వామి భగవద్గీత యొక్క ఆధ్యాత్మిక లోతును వివరించి, "భగవద్గీత మన సంస్కృతి యొక్క మూలస్తంభం. ఇది మన జీవితంలో ధర్మాన్ని క్రమబద్ధీకరించడంలో మాకు మార్గదర్శకం. మనం దీనిని ప్రతి ఇంటికి చేరవేసేలా చూసుకోవాలి." అని సూచించారు.

### విశ్వ మానవాళికి దిక్సూచిగా గీత: ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్

భగవద్గీత విశ్వ మానవాళికి దిక్సూచిగా మారిందని యాదగిరిగుట్ట ఎస్.వీ.ఎన్ ఫౌండర్ గొట్టిపర్తి భాస్కర్ అన్నారు. గీతా జయంతిలో ఆయన ప్రసంగిస్తూ ప్రపంచమంతా ఈరోజు గీతా బోధనలు అనుసరణీయమని భావిస్తున్న విషయాన్ని విద్యార్థులకు తేట తెల్లం చేశారు. భగవద్గీత విద్యార్థులకు చక్కటి వ్యక్తిత్వ వికాసాన్ని కూడా కలిగిస్తుందని ఆయన ఉదాహరణలతో వివరించారు. ఇది కేవలం ఆధ్యాత్మికపరమైనదే కాదని జీవన విధానమని అభివర్ణించారు. హిందూ సంస్కృతి గురించి మాట్లాడారు, ఇది మన సంస్కృతిలో ఎంత ముఖ్యమో చెప్పిన విషయాలను పంచుకున్నారు.

ఈ కార్యక్రమంలో భగవద్గీత శ్లోకాలను పఠించడం, సంస్కృత ప్రదర్శనలు మరియు ఆధ్యాత్మిక చర్చలు చోటు చేసుకున్నాయి, వాటి ద్వారా ప్రేరణాత్మక వాతావరణం ఏర్పడింది. చివరికి, ప్రతి ఒక్కరు భగవద్గీత యొక్క ఉపదేశాలను అంగీకరించి, భారతీయ సంస్కృతిని నిలబెట్టడంలో తమ పాత్రను గుర్తించుకున్నారు. ఈ కార్యక్రమంలో కాళీ విశ్వనాథ స్వామీజీ, రామానంద భారతి, నిర్విశేషానంద స్వామి, మాత మధు మంజరి, బిజెపి రాష్ట్ర నాయకులు రచ్చ శ్రీనివాస్, యాదగిరిగుట్ట గాయత్రి భజన మండలి అధ్యక్షురాలు రచ్చ లక్ష్మి భాయి, భాగ్యలక్ష్మి భజన మండలి అధ్యక్షురాలు

బొమ్మ భాగ్యలక్ష్మి, రచ్చ హేమలత, పులగం భవాని తదితరులు పాల్గొన్నారు.





## విద్యారత్న డాక్టర్ కోమటిరెడ్డి కి మార్వెలస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ అచీవ్మెంట్ రికార్డ్

హైదరాబాద్, డిసెంబర్ 11(రోమింగ్ న్యూస్):

విద్యారత్న డా. లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి విద్య, పర్యావరణ పరిరక్షణ, మరియు సమాజ అభివృద్ధిలో చేసిన అసామాన్య సేవలకు గాను మార్వెలస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ వారి నుండి ఘనత ప్రమాణ పత్రం అందుకున్నారు.




**ప్రధాన సేవలు మరియు బాధ్యతలు:**

1. తెలంగాణ రాష్ట్ర గ్రీన్ అంబాసిడర్:
పర్యావరణ పరిరక్షణ, వృక్షార్చన (అఫారెస్టేషన్), మరియు స్థిర జీవన విధానాల ప్రోత్సాహానికి గోపాల్ రెడ్డి గారు అంకితభావంతో పనిచేస్తున్నారు.
2. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (EPDC) నేషనల్ అడ్వైజర్:
వాతావరణ చర్యలు మరియు స్థిరమైన అభివృద్ధిపై వ్యూహాత్మక మార్గదర్శకత్వం అందిస్తూ సమాజంలో మెరుగైన పర్యావరణ అవగాహన కల్పిస్తున్నారు.
3. లోటస్ లాప్ పబ్లిక్ స్కూల్స్ చైర్మన్:
సమగ్ర విద్యను ప్రోత్సహిస్తూ, పర్యావరణ చైతన్యాన్ని విద్యా పాఠక్రమంలో కలిపి, విద్యార్థులను భవిష్యత్ నాయకులుగా తీర్చిదిద్దుతున్నారు.
4. తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల నిర్వహణ సంఘం (TRSMA) రాష్ట్ర సలహాదారు:
ఈ పాత్ర ద్వారా, తెలంగాణ వ్యాప్తంగా విద్యా నాణ్యతను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషించారు.
5. విశిష్ట రచయిత:
విజయం కోరుకునే వారి కోసం, పిల్లలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వంటి పుస్తకాలను రచించి, విద్య మరియు విలువల పై శ్రేయోభిలాషులను ప్రేరేపిస్తున్నారు.

**ప్రభావం మరియు గుర్తింపు:**

డా. గోపాల్ రెడ్డి గారి సమాజ సేవ, విద్యా పరిరక్షణ, మరియు పర్యావరణ పరిరక్షణలో చేసిన కృషి వారికి విశేష గౌరవాన్ని తెచ్చిపెట్టింది. ఆయన అభిప్రాయాలు మరియు ఆచరణా విధానాలు ఎంతో మంది వ్యక్తులు మరియు సంస్థలకు స్ఫూర్తిగా నిలుస్తున్నాయి. మార్వెలస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ నుండి ఈ ఘనత పొందడం వారి ప్రతిభను మరోసారి చాటిచెప్పింది. ఆయనకు మా హృదయపూర్వక అభినందనలు మరియు శుభాకాంక్షలు.

## తెలంగాణ తల్లి విగ్రహములో చాకలి ఐలమ్మను విస్మరించడం సరికాదు..??

### తెలంగాణ తల్లిగా చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ప్రతిష్టాపిస్తే మేము సంతోషించే వాళ్ళం...??
### - తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డేబోయిన శ్రీధర్



భువనగిరి, రోమింగ్ న్యూస్:యాదాద్రి జిల్లా కేంద్రంలోని జిల్లా రజక సంఘాల నాయకులు నిర్వహించిన మీడియా సమావేశంలో తెలంగాణ రజక సంఘాల సమన్వయ కమిటీ రాష్ట్ర కోఆర్డినేటర్ వడ్డేబోయిన శ్రీధర్ హాజరైన ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ...తెలంగాణ తల్లిగా చాకలి ఐలమ్మను ప్రకటించి అసెంబ్లీలో మరియు ప్రభుత్వ కార్యాలయాలో గ్రామ గ్రామాన కూడా చాకలి ఐలమ్మ విగ్రహాలని ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణ రోజు రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడినారు...రూపంలేని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఐలమ్మ స్ఫూర్తి అని చెబుతున్నారు కానీ ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేసి తెలంగాణ తల్లి అని ప్రకటించండి బాగుంటుంది అన్నారు, తెలంగాణ ఉద్యమంపై తెలంగాణ రాష్ట్రంపై చిత్తశుద్ధి ఉంటే చాకలి ఐలమ్మ విగ్రహాన్ని తెలంగాణ తల్లిగా ప్రకటించి ప్రతిష్టాపన చేయాలని డిమాండ్ చేశారు.

ఎందుకంటే చాకలి ఐలమ్మ కంటే తెలంగాణ తల్లి ఎవరు అనీ ఈరోజు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నము..ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్ళు తెరిచి తెలంగాణ తల్లిగా చాకలి ఐలమ్మను ప్రకటించి అసెంబ్లీలో ఐలమ్మ విగ్రహాన్ని పరీక్షించాలని లేనిపక్షంలో రానున్న స్థానిక సంస్థల ఎలక్షన్లలో రజకుల సత్తా చూపిస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం జిల్లా నాయకులు యాదయ్య, మచగిరి,పాండు, తదితరులు పాల్గొన్నారు.

## తలాపునే రిజర్వాయర్లు కట్టినా ఆలేరుకు నీళ్లెందుకు ఇయ్యలె.?

### - మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:బీఆర్ఎస్ హయాంలో ఆలేరు తలాపుననే కొండపోచమ్మ, మల్లన్నసాగర్ రిజర్వాయర్లు నిర్మించినా ఆలేరు నియోజకవర్గానికి ఒక్క చుక్క నీరు కూడా ఎందుకు ఇవ్వలేకపోయారని ఆలేరు మాజీ ఎమ్మెల్యేను యాదగిరిగుట్ట మాజీ ఎంపీపీ చీర శ్రీశైలం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగు బాలరాజు గౌడ్ ప్రశ్నించారు. యాదగిరిగుట్టలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 2018లోనే కాళేశ్వరం ద్వారా ఆలేరు నియోజకవర్గానికి గోదావరి జలాలు తెచ్చానని చెప్తున్న గొంగిడి సునీత.. దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. పదేళ్ళు ఆలేరు ఎమ్మెల్యేగా పని చేసిన గొంగిడి సునీత.. నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చారని మండిపడ్డారు. ఆలేరుకు దక్కాల్సిన తపాసుపల్లి రిజర్వాయర్ నీళ్లను హరీష్ రావు సిద్ధిపేటకు తరలించుకు పోతుంటే ఎందుకు ఆపలేకపోయారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాకే ఆలేరు నియోజకవర్గ రైతులకు సాగునీటి కష్టాలు తీరాయన్నారు. ప్రస్తుత ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య తన సొంత నిధులతో కాల్వలు, వాగులు, గొలుసుకట్టు కాల్వలకు మరమ్మత్తులు చేపించి.. ఎస్ఆర్ఎస్పీ ద్వారా ఆలేరు నియోజకవర్గాని మొట్టమొదటిసారిగా గోదావరి జలాలను తెచ్చారని పేర్కొన్నారు. ఇక బీసీ సామాజిక వర్గానికి చెందిన బీర్ల అయిలయ్య ఆలేరుకు ఎమ్మెల్యే కావడం గొంగిడి సునీతా మహేందర్ రెడ్డి దంపతులకు మింగుడుపడడం లేదన్నారు. పదేళ్ళు ఎమ్మెల్యేగా పని చేసిన గొంగిడి సునీతకు మతి భ్రమించి మాట్లాడుతున్నారని.. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యను 'హాఫ్ నాలెడ్జ్ ఫెలో' అని అనడం ఎంతవరకు సమంజసమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అవగాహన లేని అజ్ఞాని అన్న సునీత.. తమరికి తెలివుండి పదేళ్ళ నుండి ఆలేరుకు గోదావరి నీళ్లను ఎందుకు తేలేకపోయారని ప్రశ్నించారు. బీసీ ఎమ్మెల్యే అని బీర్ల అయిలయ్య పట్ల చులకనగా మాట్లాడుతున్న గొంగిడి సునీత వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకపోతే బీసీలు తమరిని నియోజకవర్గంలో తిరగనివ్వరని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మాజీ ఉప సర్పంచ్ గుండ్లపల్లి భరత్ గౌడ్, జిల్లా నాయకులు కళ్లెం జహంగీర్ గౌడ్, గ్రామశాఖ అధ్యక్షుడు పాండవుల సత్యప్రకాశ్ గౌడ్, మండల నాయకుడు ఎరుకల హేమేందర్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు బందారపు బిక్షపతి, మాజీ సర్పంచ్ సీస మనోహర్ గౌడ్, రజక సంఘం నాయకుడు గజం లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

